

మెగా హెల్త్ క్యాంప్



ప్రజాశక్తి- యాదమరి: యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో చిత్తూరులోని మనోరమ మల్టీ స్పెషాలిటీ హాస్పటిల్ వైద్యులు ప్రదీప్ కుమార్, ఉదయ్ కుమార్, ఉమా ఐకేర్ హాస్పిటల్ వైద్యులు ఉమాకాంత్ పాల్గొని పిల్లలకు వైద్య, కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు ఉచితంగా మందులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, ఉపాధ్యాయులు వెంకటరమణ, త్రివేణి, కృష్ణారెడ్డి, దాము, మధు పాల్గొన్నారు. ఈకార్యక్రమాన్ని యాదమరి మండల ప్రజాపరిషత్ అధికారి వేణు, ఈఓఆర్‌డిలు సందర్శించారు.

సమస్యలివే.. పరిష్కరించండి..

- అధికారులకు ప్రజల వినతులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, నగర పాలక సంస్థలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలు సోమవారం నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీ, నగర కమిషనర్‌కు అర్జీల రూపంలో తమ సమస్యలను తెలియజేశారు. ఎప్పటికప్పుడు అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా అధికారుల సమీక్షా సమావేశాల్లో పదేపదే జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేస్తున్నా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీదారుల తాకిడి మాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా అందుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు సుదూర ప్రాంతాల నుండి అర్జీలు చేతపట్టుకొని తిరగాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా క్రిందస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదంటు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల స్థాయి అధికారులు ప్రజాసమస్యలు పట్టించుకుని పరిష్కరిస్తే సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కలెక్టరేట్‌కు రాకుండా పరిష్కరించాలని కోరుతున్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో...

జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అర్జీలు రీఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 121, జిల్లా విద్యాశాఖ 2, పోలీస్ శాఖ 4, డీఆర్‌డీఏ 1, డ్వామా 1, జిల్లా పంచాయతీ 1, ఎంపిడిఓ చిత్తూరు 2, ఏపిఎస్‌పిడిసిఎల్ 1, వెటర్నరీ శాఖ 5, ఐసిడిఎస్1, మద్యనిషేదం అండ్ ఎక్సైజ్ 1, ఆర్ అండ్ బి 1, మున్సిపల్ కమిషనర్ చిత్తూరు 4, ఆర్‌డబ్ల్యూఎస్ 1.

ఎస్పీ కార్యాలయంలో....

వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్‌పి, డీఎస్పీ టి.సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అందిన ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని తెలిపారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నగర పాలక సంస్థలో...

పీజీ ఆర్‌ఎస్ కార్యక్రమంలో తొమ్మిది ఫిర్యాదులు వచ్చినట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో కమిషనర్ చర్చించారు. ఫిర్యాదులు, వినతులకు సంబంధించి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. అనంతరం గత వారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. ఇంజనీరింగ్ 4, ప్రజారోగ్య విభాగం 3, టౌన్ ప్లానింగ్ 2, మెప్మా 1 చొప్పున మొత్తం 9 వినతులు అందాయి. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ. వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌పి మణికంఠ చందోలు, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

పూల ధరకు రెక్కలు..

- బంతి పూలు కిలో రూ.40లు
- చామంతి కిలో రూ.150లు



ప్రజాశక్తి- వి కోట : వరుస పండుగలు, ఆయుధపూజలతో పూల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బంతిపూలు కిలో ధర రూ.10 నుంచి రూ.20 ఉండగా ప్రస్తుతం ఈ ధరలు రూ.40లకు చేరింది. కిలో రూ.50 నుంచి రూ.80 ఉన్న చామంతి రూ.150కి చేరింది. అయితే ఇది హోల్‌సేల్ ధరలు మాత్రమే. రిటైల్‌కు వచ్చే సరికి కిలో చామంతి ధర రెట్టింపు అవుతాయి.

వికోట మండల పరిధిలో బంతి, చాంమంతి వంటి పూల సాగు విస్తారంగా ఉంది. ప్రస్తుతం పూలకు మంచి ధరలు లభిస్తున్నాయి. దసరా, ఆయుధ పూజలు, స్వామి మాలల నేపథ్యంలో గత రెండు వారాలుగా పూలకు డిమాండ్ పెరగడంతో వాటి ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. సోమవారం వీకోట పూల మార్కెట్లో కిలో చామంతి రు.40ల వరకు పలికింది. చామంతి పూలు అత్యధికంగా రూ.150లు పలకడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చామంతి పులాల్లో పసుపు చామంతి.. అష్టగంధ..

జిల్లాలో రెండు రకాల చామంతి పూలు సాగు చేస్తుంటారు. అష్టగంధ కిలో అత్యధికంగా రూ.70ల వరకు పలికింది. అలాగే పసుపు చామంతి రూ.40 రూపాయలు గరిష్ట ధర పలికింది. అలాగే చామంతిలో సెంట్ ఎల్లో, సెంట్ వైట్, వైలెట్ రకాలు ఉన్నాయి. వాటిలో సెంట్‌ఎల్లో రకం చామంతి పూలు కిలో రూ.120 నుంచి 150ల వరకు ధర పలికింది. సెంట్ వైట్ రకం చామంతి పూలు కిలో రూ.130ల నుంచి 150ల వరకు పలికింది. అలాగే క్యారెట్, వైలెట్ రకం చామంతులు సైతం రూ.100 నుంచి రూ.150ల వరకు ధర పలికింది.

దసరా నుంచి దీపావళి వరకు సాధారణంగా పూలకు మంచి ధరలు ఉంటాయి. అయితే ఈ సంవత్సరం వరుసగా వర్షాలు కురడంతో పూల ధరలు పూర్తిగా పతనమయ్యాయి. తుపాను వలన పూల తోటలు అన్నీ దెబ్బ తినడంతో దిగుబడులు తగ్గి దసరా, దీపావళి పండగల నాటికి పూలధరలు అమాంతం ధరలు పెరిగాయి. సాధారణంగా కిలో రూ.50 నుంచి 90ల వరకు పలికే చామంతి ఈసారి రూ.150ల వరకు గరిష్టంగా ధర పలుకుతోంది. పూల ధరకు అమాంతం ధర పెరగడంతో సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వీకోట పూల మార్కెట్ నుంచి విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, శ్రీశైలం, రాజమండ్రి, భీమవరం, వైజాగ్, కలకత్తా, మధురై, తిరుచ్చి, మద్రాస్ తదితర ప్రాంతాలకు పూలను ఎగుమతి చేస్తారు. పూల దిగుబడులు తగ్గడంతో అక్కడి వ్యాపారుల్లో పోటీ పెరిగి ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీపావళి వరకు మరో నాలుగు రోజులు పూల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. గతంలో చాలా సందర్భాల్లో పెట్టిన పెట్టుబడులు రాకపోగా నష్టాలను చూసిన రైతులు ప్రస్తుతం గిట్టుబాటు ధర వస్తోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వికోట పూల మార్కెట్‌లో

మురకంబట్టులోనే.. టపాకాయల విక్రయాలు


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దీపావళిని పురస్కరించుకొని టపాకాయల విక్రయాలకు పివికెఎన్ డిగ్రీ కళాశాల మైదానాన్ని అధికారులు ఎంపిక చేశారు. అయితే టపాకాయల తాత్కాలిక లైసెన్స్‌దారులు మురకంబట్టు నుంచి సీతమ్స్ కాలేజ్ రోడ్డులోని హోండా షోరూం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో టపాకాయల విక్రయాలకు కేటాయించాలని విజ్ఞప్తి చేయడంతో సోమవారం ఆర్డిఓ శ్రీనివాసులు, డిఎస్పీ సాయినాథ్, అసిస్టెంట్ సిటీప్లానర్ నాగేంద్ర, అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించారు. కానీ మురకంబట్టు స్థలమే టపాకాయల విక్రయాలకు అనుకూలంగా ఉండటంతో ఆ స్థలంలోనే టపాకాయల విక్రయాలు జరపాలని ఖరారు చేస్తున్నట్లు ఆర్‌డిఒ శ్రీనివాసులు తెలిపారు.

చెకుముకి పోటీల్లో 'విజయం'కు మొదటి స్థానం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు, పలమనేరులో జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ పోటీలలో విజయం సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారని విద్యసంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి తెలిపారు. విద్యార్థులు ప్రథమస్థానం సాధించడం విజయం సిబిఎస్ఇ పాఠశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, ఆవిష్కరణలను పెంపొందించడం లక్ష్యంగా ఈ ప్రతిష్టాత్మక పోటీలో తమ బృందం అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది, వారు ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీకి చేరుకున్నారని తెలిపారు. విజేత జట్టులో ఎం.పరిణిత 9 వ తరగతి, ఖాదరిన్ సుహానా ఖాన్ 10వ తరగతి, భార్గవ్ 8వ తరగతి ఉన్నారు. విజయం విద్యార్థులు శాస్త్రీయ ఉత్సుకత, అకడమిక్ ఎక్సలెన్స్ను నొక్కి చెప్పే అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడంలో అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనం చెకుముకి సైన్స్ కాంపిటీషన్‌లో తమ విద్యార్థులు సాధించిన విజయం అని తెలిపారు.

మహా కుంభాభిషేకంలో ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పెనుమూరు మండలం, కలిగిరి కొండలో వెలసిన మహావిష్ణువు మహాప్రకార మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎంఎల్‌ఏ మురళీమోహన్ పాల్గొన్నారు. కంచి మఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి, ఆలయ నిర్వాహకులు, అర్చకులతో కలిసి పూర్ణకుంభంతో ఎంపి, ఎంఎల్‌ఏకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు వెంకటేష్ చౌదరి, జయప్రకాష్, భక్తులు రెడ్డప్ప, రాజశేఖర్ నాయుడు, సునీల్ చౌదరి, శ్రీధర్ యాదవ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.


మహా కుంభాభిషేకంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

పోలీసులకు ఉచిత మెడికల్ క్యాంపు



ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పోలీసు, హోంగార్డ్స్ పదవీ విరమణ చేసిన సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఉచిత మెగా మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని మిట్టూరులోని పోలీసుల పిహెచ్‌సిలో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ సంస్మరణ వారోత్సవాలు అక్టోబర్ 21 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు అపోలో వైద్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, విధి నిర్వహణలో వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజాభద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వైద్యశాఖ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో పోలీసు శ్వేద మహిళల బ్యారక్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అమరవీరుల స్ఫూర్తితో తరలి వచ్చిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు. రక్తదానం మహా యజ్ఞమని తాను 21 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు.

పోలీసుల రక్తదానం

విజయపురం (నగరి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నగరి ఏరియా ఆసుపత్రిలో నగరి పోలీసులు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరి సిఐ మహేశ్వర్, హనుమంతప్ప, ఎస్ఐలు ఇతర సిబ్బందితోపాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువకులు రక్తదానం చేశారు.

8 నుంచి 15 వరకు ప్రజాసమస్యల క్యాంపెయిన్

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- పలమనేరు: సిపిఎం చిత్తూరు జిల్లా 14వ మహాసభలు చిత్తూరు నగరంలో భారీ స్థాయిలో విజయవంతం అయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తెలిపారు. సోమవారం పలమనేరు పార్టీ ఆఫీసులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందని, గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన పోరాటాలను సమీక్ష చేసి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రధానంగా రైతులు, కార్మికుల సమస్యలు, మహిళలు, దళితులపై జరుతున్న దాడులకు వ్యతిరేకంగా అనేక రకాల పోరాటాలు చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. పలమనేరు ప్రాంతంలో కూడా దళితులపై దాడులు, భూకబ్జాలు జరిగినప్పుడు పోరాటాలు చేయడం జరిగిందని గుర్తుచేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా, రైతాంగ వ్యతిరేక కార్యక్రమాలపై నవంబర్ 8 నుండి 15వ తేదీ వరకు ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు జిల్లాలో విస్తృతంగా క్యాంపియన్ నిర్వహించన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, ఓబులురాజు, భువనేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

సత్తాచాటిన విద్యార్థులు

అండర్ 19 అథ్లెటిక్స్ పోటీలలో..


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కె.మౌనిక ఈనెల 25, 26, 27 తేదీలలో 68వ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిందని ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, పిడి చిన్నప్ప తెలిపారు. ఈ సందర్భంగా మౌనికను సోమవారం పాఠశాల సిబ్బంది అభినందించారు.

అండర్ -17 వాలీబాల్ పోటీలలో

హిందూపురంలో ఈనెల 25, 26, 27 తేదీలలో అండర్ -17 బాలుర వాలీబాల్ పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు విన్నర్‌గా నిలిచి జిల్లాకు పేరు సంపాదించి పెట్టారు. విన్నర్‌గా నిలిచిన చిత్తూరు జిల్లా జట్టులో సోమల మండలం కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తనీష్, దస్తగిరి చోటు సంపాదించారు. ఆటలో మంచి ప్రతిభ చూపి జిల్లా జట్టు గెలుపొందే విధంగా ఆడి గోల్డ్ కప్పు కైవసం చేసుకున్నారు. దీంతో సోమవారం గ్రామస్తుల సమక్షంలో ఇద్దరు విద్యార్థులను ఉపాధ్యాయ బృందం ప్రశంసించి వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇదేవిధంగా పాఠశాలకు గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఇతర విద్యార్థులు కూడా క్రీడా పోటీలలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటాలని ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి కోరారు. విద్యార్థులకు ఆట పోటీలలో మంచి శిక్షణ ఇచ్చి పోటీలలో పాల్గొనే విధంగా వారికి ప్రోత్సాహం అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నప్పను గ్రామస్తులు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా ప్రశంసించారు.


గోల్డ్ కప్పుతో విద్యార్థులు

క్రమ 'శిక్ష'ణా..?

- గేటు బయటే విద్యార్థుల పడిగాపులు
- రోడ్డుపై అవస్థలు



ప్రజాశక్తి- విజయపురం (నగరి)

క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను నడిరోడ్డపై గంటల తరబడి ఎండలో నిలబెట్టి శిక్ష వేస్తున్నారు ఉపాధ్యాయులు. నగరి పట్టణంలో ఉన్న పిసిఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు సుమారు వెయ్యిమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల్లో ఎక్కువభాగం మంది రూరల్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వస్తుంటారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు బస్సులు, ఆటోల్లోనే పాఠశాలకు చేరుకోవల్సిన పరిస్థితి. ఈనేపథ్యంలో బస్సు, ఆటో రావడం, లేక ప్రయాణిస్తున్న సమయంలో ఆలస్యం కారణంగా విద్యార్థులు కూడా పాఠశాలకు ఆలస్యమవుతుంటారు. ఇవేమీ పట్టించుకోని ఉపాధ్యాయులు లేట్‌గా వచ్చారు.. గేట్ బయటే ఉండండి.. అంటూ స్కూల్ గేట్లు మూసివేసి విద్యార్థులను తిడుతూ ఎండలో రోడ్డుపైనే నిలబెట్టేస్తూన్నారు.. దీంతో అటుగా రోడ్డుపై వెళ్లే వారంతా వీరిని చూస్తు ఉండటంతో విద్యార్థులు అవమానంగా భావిస్తూ మానసికంగా కృగింపోతున్నారు. విద్యార్థులకు క్రమశిక్షణలో పెడుతున్నామంటూ వారికి శిక్షను వేస్తున్నారు ఉపాధ్యాయులు. విద్యార్థులు ఏదైనా తప్పు చేసినా, క్రమశిక్షణ పాటించకపోయినా వారిని మందలించి, మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే.. తరచూ ఆలస్యంగా విద్యార్థులు ఎందుకు లేట్‌గా వస్తున్నారో విచారించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారు సరైన సమయానికి వచ్చేలా సద్దిచెప్పాలి తప్ప ఇలా విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించడం భావ్యం కాదని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పుతున్నామంటూ శిక్షించడం మాని వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారిని మందలించడం ద్వారా విద్యార్థులను సరైన మార్గంలో ఉపాధ్యాయులు నడిపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వాస్తు బాలేదని..

- మూలనపడ్డ సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలు
- టిడిపి శ్రేణులు విమర్శ



మూలనున్న సిఎం, డిప్యూటి సిఎం ఫోటోలు

ప్రజాశక్తి- విజయపురం: మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఫొటోలను మూలనపెట్టారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వీరి ఫొటోలు కచ్చితంగా ఉండాలని చెప్పి పెట్టించడం జరిగింది. అయితే విజయపురం ఎంపిడివో కార్యాలయంలో మాత్రం వాస్తు బాగలేదని ఇన్‌ఛార్జి ఎంపీడీవోనే చెప్పి ఆ రెండు చిత్రపటాలు బీరువా ఎనకాల పెట్టించడం దారుణమని స్థానిక టిడిపి నాయకులు మండిపడుతున్నారు. వాస్తు బాలేదని సిఎం, డిప్యూటి సిఎం ఫొటోలనే మూలన పెట్టిన అధికారి ఇక మండలాన్ని ఎలా అభివృద్ధి బాటలో నడిపిస్తాడు అంటూ టిడిపి శ్రేణులు విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇన్చార్జ్ ఎంపీడీవోని మార్చి రెగ్యులర్ ఎంపీడీవోని వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పలువురికి టిడిపి శాశ్వత సభ్యత్వం

ప్రజాశక్తి- ఐరాల: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమవారం ఐరాల మండల తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు రూ.లక్ష కట్టి శాశ్వత సభ్యతం పొందారు. అలాగే ప్రతి కార్యకర్త విధిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు.

శాంతిపురం: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ గౌను వారి శ్రీనివాసులు సోమవారం శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సోమవారం స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రూ.లక్ష చెల్లించి సభ్యత్వం పొందడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.

వి కోట: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏఎంసీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, ఈశ్వర్ గౌడ్ ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో మండలంల ముందంజలో ఉండేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాంబాబు, ధీరజ్, సోము, విశ్వనాథ్, శబరిష్, నాగరా ఉన్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగ

ప్రజాశక్తి- విజయపురం



నగరి ఏరియా ఆసుపత్రి సమీపంలో విద్యుత్ లైన్, స్తంభానికి చెట్ల తీగలు అల్లుకున్నాయి. దీంతో పలుమార్లు విద్యుత్ సరఫరా సమయంలో అంతరాయం ఏర్పడుతోంది. అయినప్పటికీ అధికారులు అటు వైపు కన్ను ఎత్తి చూడటం లేదని చెప్పడానికి ఇదే నిదర్శనం.

ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లీబిడ్డలు సురక్షితం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేసుకోవడం వలన తల్లీబిడ్డకు సురక్షితంగా ఉంటారని డాక్టర్ పద్మావతి తెలిపారు. సోమవారం తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమరావతి అనే మహిళకు డాక్టర్, సిహెచ్ఓ సునంద సాధారణ కాన్పు జరిగిందని, ఆమెకు ఆరోగ్యవంతమైన ఆడపిల్లల పుట్టిందని తెలిపారు. అమరావతి గర్భం దాల్చినప్పటి నుంచి సిహెచ్ఓ సాయిదివ్య, ఏఎన్ఎం నాగేశ్వరీ, ఆశా వర్కర్ రెడ్డమ్మ పర్యవేక్షణలో తొమ్మిది నెలలు వైద్యపరీక్షలు, పౌష్టికాహారం తీసుకుంటూ ఉన్నారని దాని వల్లనే నేడు తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణం కొత్తపేట వినాయక వీధిలోని వెలమ్మాల్ అనే క్యాన్సర్ రోగికి రాజ్యాధికారం బ్లడ్ డోనర్స్ నవీన్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలమ్మాల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు సోషల్ మీడియా ద్వారా తెలిసిందన్నారు. కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, కొత్తపేట యూనిట్ ఇంచార్జ్ ముఖేష్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్‌ల సమక్షంలో ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం బాధితురాలు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పెన్షన్‌దార్ల సమస్యల పరిష్కారం కోసం బుధవారం జిల్లా ఖజానా కార్యాలయాన్ని సంప్రదించి పరిష్కరించుకోవాలని ఉపఖజానా అధికారి రామచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ పొందుతున్న వారు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నా ఖజానా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

స.హ చట్టంపై అవగాహన

మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని మల్లకుంట గ్రామంలో సోమవారం రైతులకు, గ్రామ ప్రజలకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎ.రాజశేఖర్ ప్రజలకు చట్టం వలన కలిగే ప్రయోజనాలను వివరించి, వారికున్న సందేహాలను నివృత్తి చేశారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి..

ప్రజాశక్తి- వెదురుకుప్పం: యువత మాదక ద్రవ్యాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించేలా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ డాక్టర్ సి.మంగళ గౌరీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, విద్యార్థులు పాల్గొన్నారు.

'దొరికిన బంగారాన్ని తిరిగిచ్చాడు'



బంగారు గొలుసు అందజేస్తున్న మురళి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తన సమస్యలను జిల్లా కలెక్టర్‌కు చెప్పుకుందామని సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన పొన్‌మణి పొరబాటున మెడలోని 30 గ్రాములు బంగారు గొలుసును పోగొట్టుకుంది. అదే సమయంలో కలెక్టరేట్ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన పుంగనూరుకు చెందిన మురళి తనకు దొరికిన బంగారు గొలుసును పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ జరుగుతున్న పోలీస్ ఆఫీస్‌కు వెళ్లి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్‌కు అందించారు. తనకు కలెక్టరేట్ వద్ద దొరికిందని పొగొట్టుకున్న వారికి అందజేయాలని కోరారు. టూ టౌన్ సిఐకి సంఘటనా స్థలానికి వెళ్ళి విచారించి పొన్‌మణి బంగారు గొలుసుగా నిర్ధారించారు. ఎస్పి కార్యాలయంలో జిల్లా ఎస్పీ సమక్షంలో మురళి చేతుల మీదుగా అందజేశారు. మురళి నిజాయితీని ఎస్పీ అభినందిస్తూ పోలీస్‌శాఖ నుండీ క్యాష్‌రివార్డును అందజేశారు.

విద్యా సామగ్రి వితరణ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమృత భారతి ఫౌండేషన్ (చిత్తూరు) వ్యవస్థాపకులు ప్రకాష్ రెడ్డి దాతృత్వం ప్రముఖ శతావధాని ఆముదాల మురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.50వేలు విలువ గల విద్యా సామగ్రిని అందజేశారు. అలాగే స్వామి వివేకానంద జీవితం– సందేశం అనే రామకృష్ణ మిషన్ వారి పుస్తకాన్ని విద్యార్థులకు వితరణగా ఇవ్వడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని పేదవిద్యార్థులకు ప్రకాష్‌రెడ్డి సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దాత ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అమృత భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు పరిసర ప్రాంతాలలోని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పాఠశాలల విద్యార్థులకు అవసరమయ్యే విద్యాసామగ్రిని ఉచితంగా అందిస్తున్నామని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గణిత అవధాని అరుణ శివప్రసాద్, ఉపాధ్యాయులు సంజీవి, పిళ్ళారప్ప, సంపంగి, ప్రేమకృష్ణ, ధనశేఖర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, భారతి పాల్గొన్నారు.

'పారిశుద్ధ్య పనులు చేపట్టాలి'

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని ప్రతి పంచాయతీ పరిధిలో సోమవారం నుంచి 10 రోజులు పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎంపీడీవో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో మురుగునీటి వ్యవస్థ శుద్ధి పరచడం, తాగునీటి, ట్యాంకర్లు క్లీనింగ్‌తో పాటు చివరి రోజు దోమల నివారణకు ప్యాగింగ్ పనులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చేయాలని సచివాలయ సిబ్బంది ఆదేశించారు. ఎక్కడైనా ఈ పనులు చేపట్టకుంటే నేరుగా తనతో సంప్రదించాలని ఎంపీడీవో తెలిపారు.

సేంద్రియ ఎరువులతో వ్యవసాయం



ప్రజాశక్తి- యాదమరి: సేంద్రియ ఎరువులతో ప్రతి రైతు పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి చరిత సూచించారు. సోమవారం సుచి సింధియా ఫీల్డ్ ఆఫీస్ జోడి చింతల ట్రైనింగ్ సెంటర్‌లో సేంద్రియ ఎరువులతో వ్యవసాయం ఉత్పత్తి కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా వ్యవసాయ ట్రైనింగ్ అధికారి పద్మజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడును సాధించుటకు సేంద్రియ ఎరువులు వాడాలని రసాయనిక మందులు బదులు బయో ఫెర్టిలైజర్ ఉపయోగించాలని మట్టి పరీక్ష చేసి ఏకాలానికి ఏమి పంట వేయాలని రైతు వ్యవసాయదారులకు క్లుప్తంగా తెలియజేశారు. అదేవిధంగా ఉద్యానవన శాఖ సిబ్బంది అనిత, పూజ సబ్సిడీ పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పాల్ విజయ కుమార్, గ్లోరీ విజయ కుమార్, జాకబ్, జాన్సన్, వరదరాజులు, మనీ, డి.చిన్నయ్య పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించినట్టు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. బాలప్పగారిపల్లి, సమాధిగుట్టపల్లి, పగడాలవారిపల్లి గ్రామాలలో దోమల నివారణ కోసం ఫాగింగ్ మిషన్ ద్వారా గ్రామంలో స్ప్రే చేసినట్టు ఆయన తెలిపారు.

నీటి తొట్టెలో చెత్త చెదారం, మద్యం బాటిళ్లు



చెత్తాచెదారంతో నిండి ఉన్న వాడకంలో లేని నీటి తొట్టి

ప్రజాశక్తి- సోమల : మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో వాడకంలో లేని నీటితొట్టెలో చెత్తాచెదారం పేరుకుపోయింది. రాత్రి వేళల్లో వాడకంలో లేని నీటి తొట్టె పరిసర ప్రాంతాలలో ఎలాంటి వెలుతురు లేకపోవడం కారణంగా మందుబాబులు తొట్టి వద్దకు వచ్చి అక్కడే మద్యం తాగి వాటర్ బాటిల్లు వాటర్ ప్యాకెట్లు ఖాళీ మద్యం బాటిల్లు తొట్టెలో వేసి పోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఎక్కడా అర్జీదారులు ప్రజలు కార్యాలయాలకు వస్తే కూర్చోవడానికి ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఎన్నో చెట్లు ఉన్న చెట్ల నీడన నిలబడే ఉండాల్సిన పరిస్థితి రావడంతో ఈ వాడకంలో లేని నీటితొట్టి వద్ద వచ్చి కూర్చుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలోనే మద్యం తాగి ఖాళీ సీసాలను తొట్టిలో వేస్తున్నారే.. అనుకుంటూ పోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి వాడకంలో లేని నీటి తొట్టెను అక్కడ నుండి తరలించడం లేక తొట్టెలోని మద్యం బాటిల్లు వాటర్ బాటిల్లు చెత్త చెదారం తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని కోరుకుంటున్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం

ట్రస్ట్ చైర్మన్ చెన్నకేశవులు నాయుడు



సర్టిఫికేట్లు ప్రదానం చేస్తున్న చెన్నకేశవ నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: యోగాతో మానసిక ఉల్లాసం పొందవచ్చు అని జిజేయం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెన్నకేశవులు నాయుడు తెలిపారు. సోమవారం నగరంలోని స్థానిక పివికేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ విభాగం 2023 -2024 సంవత్సరంలో యోగా విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులకు అవార్డుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమాన్ని యోగా తరగతుల నిర్వహకులు శ్రీనివాసులు నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ జీవన జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా చెన్నకేశవులు నాయుడు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికి వృత్తి, ఇతర కారణాలతో మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, తగినంతగా వ్యాయామం చేయకపోవడంతో అనేక రోగాల భారీనపడి ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, శరీరదృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి యోగా సరైన మార్గమని సూచించారు. అనంతరం యోగా శిక్షకులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులు విద్యతోపాటు యోగాను కూడా అభ్యసిస్తే ఆరోగ్యంతో పాటు రానున్న రోజులలో ఉపాధికి ఉపయోగపడుతుందని సూచించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి..

ప్రజాశక్తి- రామకుప్పం: స్వయం సహకార సంఘ మహిళలు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షులు ఆనందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో వీవో లీడర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో చిన్నచిన్న పరిశ్రమలుగా ఏర్పాటు చేసుకొని బ్యాంకుల ద్వారా రుణాలు పొంది అభివృద్ధి చెందాలన్నారు. ఆవులు, గొర్రెలు, కోళ్ళు, టైలరింగ్, అల్లికలు, చేతివృత్తులు తదితర వాటిని ప్రోత్సహిస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతులకు సహకరిస్తామన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజవర్గంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధాన కార్యదర్శి నరసింహులు, రామ్మూర్తి, సీతాపతి, చలపతి, మనోహర్, కామరాజు నాయక్, సుబ్రీ, విశ్వనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, బాలరాజు, వెంకటరమణ, మంజునాథ్, సురేష్, ఆదిల్, గజేంద్ర, ఎపీఎం శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో 108 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: 108 అంబులెన్స్ సిబ్బంది సోమవారం గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. 108 సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో పస్తులపాలవుతున్నామని, వెంటనే తమకు జీతాలు మంజూరు చేయాలని నిరసన తెలిపారు. వార్షిక ఇంక్రిమెంట్ చెల్లించడం లేదని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఇచ్చే సదుపాయాలు ఏవీ తమకు చెల్లించలేదని, 108 వ్యవస్థలో కూడా రోజుకు మూడు షిఫ్ట్ లలో ఎనిమిది గంటల చొప్పున పని విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఏఈఎంఎస్ సంస్థ ఇచ్చిన హామీ మేరకు వేతన స్లాబ్‌ను అప్గ్రేడ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో 108 సిబ్బంది ప్రసాద్, చేతన్ బాబు, సందీప్, ప్రదీప్, చిట్టిబాబు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న 108 సిబ్బంది

విద్యుత్ నూతన పాలసీ తీసుకొస్తున్నాం

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: విద్యుత్తుపై ప్రభుత్వం నూతన పాలసీని తీసుకొస్తుందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా ఎన్‌డీఏ కూటమి ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుచానూరు సమీపంలోని ప్రైవేటు హోటల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధికి, ఎన్‌డీఏ కూటమి మధ్య సఖ్యతకు సమీక్ష నిర్వహించామ అన్నారు. కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, రూ.10లక్షల కోట్ల అప్పులు ఉన్న పేదవాడి కళ్ళలో ఆనందం చూడాలని కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని అన్ని పంచాయతీలతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీలకు కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీపావళి పండుగతో పాటుగ, ఉచిత సిలిండర్ అందుబాటులోని తీసుకువస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అవనీతి అక్రమాలకు విచారణ జరుగుతోందన్నారు. తల్లిని, చెల్లిని రోడ్డు కీడ్చిన జగన్ లాంటి వ్యక్తిని ఇంతవరకు చూడలేదని దుయ్యబట్టారు. రెవిన్యూ వ్యవస్థను వైసిపి సర్వనాశనం చేసిందన్నారు. కుటుంబ సమస్యను పరిష్కరించుకుని ఆ తరువాత జనం గురించి మాట్లాడు జగన్ అని హితావు పలికారు. జగనన్న కాలనీలలో ఉండలేమన్న వారికి ప్రత్యామ్నాయం చూపించే ప్రయత్నం చేస్తాం అన్నారు. ఎన్డీయే కూటమి నేతలు అంత సమన్వయంతో వెళుతున్నారన్నారు. ఒక్క సత్యవేడులో మాత్రమే కొన్ని విభేదాలు ఉన్నాయన్నారు. డబ్బు ఉండి రోడ్డుకు ఎక్కిన కుటుంబం జగన్ దే డైవర్షన్ పాలిటిక్స్ అని మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, బిజెపి, టిడిపి, జనసేన సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'తొలి దశలో యాజమాన్యంతోనే మంచి దిగుబడులు'



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ భాస్కరయ్య

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: వరి పైరు నాటిన 45 రోజులు వరకు మంచి యాజమాన్యం పాటిస్తేనే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. బాలయపల్లి మండలం, పిగిలాం గ్రామంలో రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. మొక్కలు బలంగా ఎదగడానికి అవసరమైన కాంప్లెక్స్, పొటాస్ ఎరువులను దుక్కిలోనే వేయాలని సూచించారు. నాట్లుపై పైనే వేయాలని తెలిపారు. నాటిన తర్వాత చిరు పొట్ట దశ వరకు పొలంలో పలుచగా నీరు పెట్టాలని, దీనివలన పిలకలు అధికంగా వస్తాయని చెప్పారు. పిలకలు పెట్టే దశలో 35–40 కిలోల యూరియా వేస్తే, చీడలు అదుపులో ఉంటాయని చెప్పారు. పంటకు అధికంగా యూరియా వాడకం వలన చీడల బెడద ఎక్కువై దిగుబడును తగ్గుతాయన్నారు. వరిలో కలుపు, చీడల నివారణ గురించి ఏఓ వేణుగోపాల్ రావు వివరించారు. నిమ్మలో కత్తిరింపులు, పూత నియంత్రణ, చీడల నివారణ గురించి ఉద్యాన అధికారి ఆనంద రెడ్డి వివరించారు. పండ్లు, కూరగాయలు, పూల సాగుకు ఉద్యాన శాఖ అందిస్తున్న పథకాల గురించి ఆయన రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతులతో పాటు మండల వ్యవసాయ అధికారి శిరీష, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపాల్, వినోద్ కుమార్, పెంచలయ్య, సలీం పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చెన్నై హైవేలో ఘోరం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రజాశక్తి- విజయపురం (నగరి): తిరుపతి–చెన్నై జాతీయ హైవేలో సోమవారం ఉదయం ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నగరి పట్టణ పరిధిలోని ఎస్ఎంసీ థియేటర్ ఎదురుగా లలిత లేఅవుట్‌కి చెందిన చిరంజీవి(34) సోమవారం ఉదయాన్నే రామాపురం వ్యవసాయ పొలం నుంచి నగరి పట్టణానికి బైక్‌పై వెళుతుండగా కడప నుంచి సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ చిరంజీవిని వెనుక వైపు నుంచి ఢీకొంది. దీంతో చిరంజీవి శరీరం ఛిద్రమై అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి- పూతలపట్టు



పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని గోపాల కృష్ణాపురం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. పోలీసుల వివరాల పెంచలకోన నుంచి బెంగళూరుకు వెళుతున్న మాలకొండయ్య (64) మరో ఐదుగురు కుటుంబ సభ్యులతో కలిసి స్కార్పియోలో వెళుతూ ఉండగా అకస్మాత్తుగా వాహనం నుంచి పొగ రావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పరుగులు తీశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో వాహనంతో పాటు అందులో ఉంచిన ఐఫోన్ కాలి బూడిదైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం కేసులో..

వ్యక్తి ఐదేళ్లు జైలుశిక్ష



ఏసురత్నంరెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: ఎర్రచందనం కేసులో ఓ వ్యక్తికి కోర్టు తీర్పు మేరకు జైలు శిక్ష తో పాటు జరిమానా విధించారు. ఈ మేరకు సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగాధర నెల్లూరు మండలం బాలగంగానపల్లి పంచాయతీ నాగూరు పల్లి గ్రామానికి చెందిన ఏసురత్నం రెడ్డి (52)పై 2017లో ఎర్రచందనం కేసు జీడి నెల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో నిందితుడైన అయిన ఏసురత్నం రెడ్డికి మంగళవారం తిరుపతి రెడ్ శాండిల్ కోర్టు ఐదు ఏళ్ళు జైలుశిక్షతో పాటు రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు సిఐ తెలిపారు.

దొంగ అరెస్టు

రూ.1,80,000లు స్వాధీనం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. సిఐ మురళీ మోహన్ తెలిపిన సమాచారం మేరకు బైరెడ్డిపల్లి గ్రామంలో ఈనెల 20న వీరభద్ర అనే వ్యక్తి ఇంట్లో రూ.1,80,000లు నగదు, వెండిపట్టీలు దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో దేవదొడ్డి గ్రామం వద్ద అనుమానాస్పదంగా ఉన్నటువంటి పాండురంగను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, దొంగతనం నేరం ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అతని వద్ద నుండి నగదు, పట్టీలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లుతెలిపారు. ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ముద్దాయిని చూపుతున్న పోలీసులు

అయ్యోర్ల ప్రమోషన్ షెడ్యూల్ విడుదల

- యూటీఎఫ్ హర్షం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రాష్ట్రంలోని మున్సిపల్ పాఠ శాలల్లో ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్ పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయ డానికి రాష్ట్ర విద్యాశాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర యుటిఎఫ్ శాఖ దశల వారీగా పోరాటాలకు పిలుపునివ్వడం, ఆ ప్రకారంగా యుటిఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు చేసిన పోరాట ఫలితమే ఈ జీవోనని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వా నికి విద్యాశాఖ డైరెక్టర్‌కి మున్సిపల్ ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపల్ మేనేజ్మెంట్‌లోని సీనియర్ హెచ్ఎంలకు మండల విద్యాశాఖ అధికారి పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్ లోని సీనియర్ ప్రధాన ఉపాధ్యాయులకు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులు ఇవ్వాలని యుటిఎఫ్ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్వీయూకు రూ.10లక్షల విరాళం

ప్రజాశక్తి-క్యాంపస్

ఎస్వీయూలో దూరవిద్య ద్వారా మనోవిజ్ఞాన శాస్త్రం అభ్యసించి, అమెరికాలోని చికాగోలో వుంటున్న ఫ్రీ లైన్స్ జర్నలిస్టు, ఇండియా ట్రిబ్యూన్ పత్రిక మాజీ ఎడిటర్ జెవి లక్ష్మణరావు వారి తల్లిదండ్రుల పేరున దూరవిద్య శాఖలో తరగతి గది కోసం రూ.10లక్షల విరాళపు చెక్కును ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతినాయుడులకు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్–ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ఇంజనీర్ తాండవ కృష్ణ, డిడిఇ డైరెక్టర్ ఆచార్య తవమణి, డిఆర్ సునీత, దయసాగర్, డిడిఈ భాస్కర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.